మృతి చెందిన మాదాసు రాణి

కూతురును నరికి చంపిన కన్న తండ్రి

ప్రజాశక్తి-ఐ.పోలవరం (అంబేద్కర్ కోనసీమ జిల్లా)

అనుమానంతో కూతురును కన్న తండ్రే నరికి చంపిన ఘటన అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ పోలవరం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పాతఇంజరంలో కౌలు రైతు మాదాసు శివ సుబ్రహ్మణ్యం కుటుంబం ఉంటోంది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన భార్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. ఆదివారం చిన్న కుమార్తె, కుమారుడు బయటకు వెళ్లారు. అదే సమయంలో పెద్ద కుమార్తె మాదాసు రాణి (27)పై తండ్రి సుబ్రహ్మణ్యం కత్తితో దాడి చేశాడు. మెడ పైన, భుజంపైన నరికాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆమె మరణించారు. సుబ్రహ్మణ్యం పోలీసులకు లొంగిపోయాడు. కుమార్తెపై అనుమానంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఎస్ఐ జె భాను ప్రసాద్ తెలిపారు.

ఒకరిని రక్షించబోయి మరొకరు

- చెరువులో పడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)

చెరువులో పడి ఇద్దరు మృతి చెందిన సంఘటన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిర్లంగి గ్రామానికి చెందిన కొంత మంది సమీపంలో ఉన్న చెరువులో స్నానం చేస్తున్నారు. సబిత (49) అనే మహిళ స్నానం చేస్తుండగా గుంతలోకి జారుకుంది. కాపాడంటూ కేకలు వేయడంతో సమీపంలో ఉన్న దూపాన భైరి (75) ఆమెను కాపాడేందుకు చెరువులో దూకి ఆయన కూడా చిక్కుకున్నారు. కొందరు గ్రామస్తులు గమనించి ఇద్దరినీ ఒడ్డుకి తీసుకొచ్చారు. ప్రయివేటు వాహనంలో ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భైరి

సమితా రాణి

బిఎస్ఎన్ఎల్‌లో 2 కొత్త ప్రీపెయిడ్ ప్లాన్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్ రెండు కొత్త ప్రీపెయిడ్ ప్లాన్లను తీసుకొచ్చింది. వీటిలో ఒకటి డేటా వోచర్ కాగా.. మరొకటి వ్యాలిడిటీ పొడిగింపు ప్లాన్. వీటి ధరలు వరుసగా రూ.58, రూ.59.

రూ.58 ప్లాన్ పూర్తి వివరాలు

బిఎస్ఎన్ఎల్ అందిస్తున్న రూ.58 ప్లాన్ ఒక డేటా వోచర్. దీన్ని పొందాలంటే కచ్చితంగా ఒక యాక్టివ్ బేస్ ప్లాన్ ఉండాల్సిందే. దీని వ్యాలిడిటీ ఏడు రోజులు. ప్రతిరోజూ 2 జిబి డేటా లభిస్తుంది. పూర్తి డేటా అయిపోయిన తర్వాత వేగం 40 కెబిపిఎస్‌కు తగ్గిపోతుంది.

రూ.59 ప్లాన్ పూర్తి వివరాలు

రూ.59 ప్లాన్ వ్యాలిడిటీ ఏడు రోజులు. ఎస్ఎంఎస్ ప్రయోజనాలుండవు. రోజుకు 1 జిబి డేటా లభిస్తుంది. అపరిమిత వాయిస్ కాలింగ్ ఉంటుంది. బిఎస్ఎన్ఎల్ ఈ ఏడాది ఆగస్టు నుంచి దేశ వ్యాప్తంగా 4జి సేవలను ప్రారంభించనుందని అధికారిక వర్గాలు ఇటీవల తెలిపాయి. 4జి సేవలకు పూర్తిగా స్వదేశీ సాంకేతికతనే సంస్థ ఉపయోగించనుంది. ప్రయోగాత్మక దశలో 700 – 2,100 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో రూపొందించిన 4జి నెట్‌వర్క్‌లో, 40–45 ఎంబిపిఎస్ డేటా వేగాన్ని నమోదు చేసినట్లు బిఎస్ఎన్ఎల్ అధికారులు వెల్లడించారు.

షిప్‌యార్డ్ కాంట్రాక్టు ఎల్&టి కి!

- ఎఫ్ఎస్ఎస్‌ల్లో 2 నౌకల నిర్మాణ పనులు అప్పగించే యత్నం?
- హెచ్ఎస్ఎల్ మనుగడపై ప్రభావం
- ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్కించుకున్న రూ.19 వేల కోట్ల 5 ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్ఎస్)ల కాంట్రాక్టును యాజమాన్యం దొడ్డిదారిన ఎల్అండ్‌టి ప్రైవేట్ కంపెనీకి ధారాదత్తం చేయాలని చూస్తోంది. ఓ పక్క దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సాగుతుండగా సందట్లో సడేమియా అన్నట్టుగా సుమారు రూ.8200 కోట్ల విలువైన రెండు షిప్‌ల నిర్మాణ బాధ్యతలను ఎల్అండ్‌టికి అప్పగించడానికి రంగం సిద్ధం చేసింది. 2014లోనే షిప్‌యార్డుకు దక్కాల్సిన 5 ఎఫ్ఎస్ఎస్‌ల కాంట్రాక్టును కేంద్రంలోని బిజెపి ఇవ్వనిరాకరించింది. ఎట్టకేలకు 2023లో దీన్ని హిందుస్థాన్ షిప్‌యార్డు సాధించగలిగింది. పదేళ్ల తర్వాతైనా షిప్‌యార్డుకు ఆర్డర్లు దక్కినందుకు ఉద్యోగులు, కార్మికులు సంతోషించారు. వాస్తవానికి 2010లోనే రక్షణ అవసరాల నిమిత్తం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ విశాఖ హెచ్ఎస్ఎల్‌ను తన అధీనంలోకి తీసుకుంది. ఎఫ్ఎస్ఎస్, ఎల్‌పిడి, పి 751 సబ్‌మెరైన్‌ల వర్క్ ఆర్డర్లను నామినేషన్ పద్ధతిలో ఇస్తామని కేంద్రం ఆనాడే హామీ ఇచ్చింది. ఆ తర్వాత కేవలం 11184 షిప్‌ను మాత్రమే నామినేషన్ పద్ధతిలో కేటాయించింది. ఆ తర్వాత అన్నీ బహిరంగ మార్కెట్‌లో టెండర్ల ద్వారా పోటీపడేలా హిందుస్థాన్ షిప్‌యార్డును బిజెపి సర్కారు వదిలేసింది. 5 ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణాన్ని సకాలంలో ప్రారంభించలేదు. వీటి నిర్మాణం, మౌలిక వసతుల ఏర్పాటుకు బ్యాంకుల నుంచి షిప్‌యార్డు రూ.వందల కోట్లు రుణం తెచ్చింది. దీనికి ఏడాదిన్నరగా వడ్డీలు కడుతూ అప్పుల్లోకి వెళ్లిపోయినట్టు సమాచారం. దీన్ని సాకుగా చూపించి తాజాగా 2 నౌకల నిర్మాణ బాధ్యతలను ఎల్అండ్‌టికి ఇచ్చేయాలని, నాలుగో దశ ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నిర్ణయం పట్ల షిప్‌యార్డు ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

టెండర్ల ప్రక్రియ ఎలా ఉండబోతుంది?

రూ.8200 కోట్ల విలువైన 2 ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణాన్ని నేరుగా ఎల్అండ్‌టికి ఇచ్చేస్తే విమర్శలు వస్తాయని భావించిన షిప్‌యార్డు యాజమాన్యం కొచ్చిన్ షిప్‌యార్డును 'డమ్మీ'గా పిలిచేందుకు రంగం సిద్ధం చేసింది. నేరుగా ఒక ప్రయివేట్ కంపెనీకి షిప్‌యార్డులోని షిప్‌ల నిర్మాణ బాధ్యతలను ఇవ్వకూడదన్న నిబంధన వల్ల కొచ్చిన్ షిప్‌యార్డుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎంట్రీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో షిప్‌యార్డు యాజమాన్యం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. కేంద్రం ఇంతలా ఉత్సాహం చూపడానికి కారణమూ లేకపోలేదు. ప్రధాని మోడీ సన్నిహితుడైన కార్పొరేట్ అదానీ... దేశంలోని కొచ్చిన్ షిప్‌యార్డులోకి ఇదివరకే 'అదానీ హార్బర్ సర్వీసెస్ లిమిటెడ్' పేరుతో ప్రవేశించారు. దేశంలోని మేజర్ పోర్టులన్నిట్లోనూ అదానీ పోర్ట్స్ హార్బర్ సర్వీసెస్ తయారు చేసే గ్రీన్ టగ్లను వాడాలన్న నిబంధనను కేంద్రం 2023లోనే పెట్టింది. ఈ మేరకు కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ నౌకల నిర్మాణ వ్యవహారాల్లో అదానీ గ్రూప్‌తో ఎంఒయు కూడా చేసుకున్నందున 5 ఎఫ్ఎస్ఎస్‌ల్లో ప్రస్తుతం రెండింటికి, తర్వాత మిగతా మూడింటికీ ఎసరొచ్చే ప్రమాదం ఉంది. ఈ దృష్ట్యా 2024లో నికర లాభ లక్ష్యం రూ.1000 కోట్లు షిప్‌యార్డుకు రాదన్నది స్పష్టమవుతోంది. దీంతో, షిప్‌యార్డు ఉద్యోగులు, కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మొత్తంగా 5 ఎఫ్ఎస్ఎస్‌లు నిర్మిస్తే వచ్చే రూ.19 వేల కోట్ల టర్నోవర్ సొమ్మును ప్రయివేట్ కార్పొరేట్ దోచుకోనున్నారనే చర్చ సాగుతోంది. ఎల్అండ్‌టికి ఇచ్చే రెండు షిప్‌ల నిర్మాణ టెండరు వ్యవహారంపై పోరాడేందుకు షిప్‌యార్డు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి
- ముగ్గురికి గాయాలు


దేవి సంధ్య

జస్విత

ప్రజాశక్తి – గోపాలపట్నం (విశాఖపట్నం)

రాష్ట్రంలో వేర్వేరు జిల్లాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాలలో నలుగురు మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. ప్రకాశం జిల్లాలో ఇద్దరు అక్కాచెల్లెళ్లు మృతి చెందారు. విశాఖపట్నంలో ఇద్దరు యువకులు మరణించారు. ఈ రెండు ఘటనలకు అతి వేగమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు, స్థానికులు సమాచారం మేరకు... విశాఖ కంచరపాలెం ప్రాంతానికి చెందిన ఆరెల్లి పవన్ కుమార్ (23), దొండపర్తి ప్రాంతానికి చెందిన తానవరపు కుమార్ (24), తాటిచెట్ల పాలెంకు చెందిన గాంధీ ముగ్గురు స్నేహితులు కలిసి గాజువాక నుంచి నగరంలోకి ఎన్ఎడి జంక్షన్ మీదుగా బైక్‌పై వెళ్తున్నారు. ఎన్ఎడి ఫ్లైఓవర్‌పైకి వచ్చేసరికి బైక్ వేగాన్ని అదుపు చేయలేకపోయారు. దీంతో డివైడర్‌ను బలంగా ఢీకొట్టి ఫ్లైఓవర్ పై నుంచి కింద పడిపోయారు. ఈ ఘటనలో పవన్ కుమార్ తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందారు. కుమార్, గాంధీలకు తీవ్ర గాయాలవడంతో కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించి కుమార్ మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని గుర్తించారు. సిఐ చక్రధరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాపట్లకు చెందిన యాలవల వెంకటేశ్వర్లు, భారతి దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. వెంకటేశ్వర్లు ఉప్పుగుండూరులోని ఒక మిఠాయి దుకాణంలో పనిచేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో స్వగ్రామమైన బాపట్లలో ఓట్లు వేసేందుకు భార్యాభర్తలిద్దరూ ఒక బైక్‌పై, ముగ్గురు ఆడపిల్లలు, వెంకటేశ్వర్లు తమ్ముడు లక్ష్మయ్య మరో బైక్‌పై బాపట్లకు బయలుదేరారు. చినగంజాం రొంపేరు కాలువ వద్దకు వచ్చేసరికి పొన్నూరు వైపు నుండి ఒంగోలు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి పిల్లలతో ఉన్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దేవి సంధ్య (11), జస్విత (9) అక్కడికక్కడే మృతిచెందారు. మరో బాలిక అశ్విని, లక్ష్మయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చీరాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని తల్లీకుమారుడు దుర్మరణం

- మృతుల్లో అంగన్‌వాడీ వర్కర్

ప్రజాశక్తి-కావలి రూరల్

ఎన్నికల విధులకు వెళ్తు రైలు ఢీకొని అంగన్‌వాడీ వర్కర్, ఆమె వెంట ఉన్న కుమారుడు దుర్మరణం చెందారు. ఈ ఘటన నెల్లూరు జిల్లా కావలిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. సైదాపురం మండలం, చాగణం గ్రామానికి చెందిన బట్టా సుభాషిణి (58) రాపూరు ప్రాజెక్ట్ చాగణం సెక్టార్‌లో అంగన్‌వాడీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెకు కావలిలో ఎన్నికల విధులు కేటాయించడంతో భర్త, కుమారుడు విజయ్ కుమార్ (28)తో కలిసి చాగాణం నుంచి గూడూరు రైలులో కావలికి సుభాషిణి బయల్దేరారు. కావలిలో రైలు దిగి ట్రాక్ దాటుతుండగా అదే ట్రాక్‌పై వస్తున్న రైలు సుభాషిణిని, ఆమె కుమారుడిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తల్లీ కుమారులకు రూ.50 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాతమ్మ, షేక్ రెహనా బేగం డిమాండ్ చేశారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

తవణంపల్లి (చిత్తూరు జిల్లా): ఏనుగు దాడిలో వ్యక్తి మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలంలో చోటుచేసుకుంది. అటవీ అధికారుల సమాచారం మేరకు.. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లె మండలం వెంగంపల్లె గ్రామానికి చెందిన పి.చిన్నయ్య (50) ఆదివారం ఉదయం కాలనీకి సమీపంలోని మామిడి తోటలో బహిర్భూమికి వెళ్లారు. ఏనుగును చూసిన కుక్కలు మొరిగాయి. దీంతో చిన్నయ్య అటుగా వెళ్లగా.. ఆయనను ఏనుగు వెంబడించి చంపేసింది. స్థానిక అటవీ శాఖ, పోలీసు అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గోదావరి దాటుతూ ముగ్గురు మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం(అంబేద్కర్ కోనసీమ)

గౌతమి గోదావరి నది దాటుతుండగా ప్రమాదవశాత్తూ ఇద్దరు మహిళలు, ఒక బాలిక మృతి చెందారు. ఈ ఘటన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆలమూరు మండలం బడుగువాని లంకకు చెందిన కర్రి సునీత (16) ఇటీవల పదో తరగతిలో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచింది. ఈ నేపథ్యంలో ఆమె అదే ప్రాంతానికి చెందిన పల్లూరి సత్య అనంతలక్ష్మి (40), కప్పిరెడ్డి ఏసమ్మ (60)లతో కలిసి శనివారం వాడపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి బయలుదేరింది. వారు ముగ్గురు మడికి వద్ద గౌతమి గోదావరిని దాటుతుండగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గల్లంతయ్యారు. రాత్రయినా వారి సెల్‌ఫోన్లు పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం గల్లంతైన సమీపంలోనే మూడు మృతదేహాలను స్థానికులు గుర్తించారు. మృతులు అనంతలక్ష్మి, ఏసమ్మ, సునీతగా గుర్తించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ ఎస్ శ్రీనివాసు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఏసమ్మ

సత్యఅనంతలక్ష్మి

సునీత

దేవుడిపై ప్రమాణం.. ఆపై తాయిలాలు

ప్రజాశక్తి – తిరుపతి బ్యూరో

డబ్బులిచ్చినా ఓటర్లు ఓటు వేస్తారో లేదోననే అపనమ్మకంతో తిరుపతి వైసిపి అభ్యర్థి అనుచరులు, టౌన్‌బ్యాంక్ ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో దేవుడిపై ప్రమాణం చేయిస్తున్నారు. 'ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తాం.. మా కుటుంబ సభ్యులతోనూ వేయిస్తాం' అని గంగమ్మ గుడి దగ్గర కర్పూరం వెలిగించి ఓటర్లతో బలవంతంగా ప్రమాణం చేయిస్తున్నారు. ఓటర్లకు బలవంతంగా మందు, డబ్బులు పంచడమే గాకుండా, ఓటు వేయాలని ప్రమాణం చేయించడాన్ని తప్పుబడుతూ తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్‌కు జనసేన, టిడిపి అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకు కేతం జయచంద్రారెడ్డిపై కేసు నమోదు చేశారు. పద్మావతిపురం, పద్మావతి యూనివర్సిటీలోని మరో బూత్ వద్ద ఓటర్ల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బెలూన్లు, చలువ పందిళ్లు వైసిపి రంగుల్లో ఉన్నాయని, వెంటనే తొలగించాలని తిరుపతి టిడిపి జిల్లా అధ్యక్షులు నరసింహయాదవ్ ఫిర్యాదు చేశారు.

గంగమ్మ గుడి వద్ద కర్పూరం వెలిగించి ఓటరుతో ప్రమాణం చేయిస్తున్న వైసిపి నాయకులు

సొంతూళ్లకు జనం..

- విజయవాడలో సర్వీసులు లేక ప్రయాణికుల పాట్లు
- రద్దీని బట్టి ప్రత్యేక సర్వీసులు : ఆర్‌టిసి ఎమ్‌డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజానీకం పోటెత్తుతున్నారు. వివిధ ఉద్యోగ, వ్యాపార, వృత్తి రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు తరలివెళ్లిన ప్రజలు, యువత ఓట్లు వేసేందుకు సొంతూళ్లకు క్యూ కడుతున్నారు. గతంలో మునుపెన్నడూ లేని విధంగా ఈసారి పెద్ద సంఖ్యలో జనాలు తరలొస్తుండటంతో బస్సులు, ప్రైవేటు ట్రావెల్స్, ఇతర రవాణా సర్వీసులు కిక్కిరిశాయి. మరికొందరు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా, ఇంకొందరు సొంత వాహనాల్లోనే ఇళ్లకు పయనమయ్యారు. దీంతో జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులన్నీ వాహనాలతో నిండిపోయి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఐటి, ఇతర ఉద్యోగాలకు శనివారం, ఆదివారం సెలవులు కావటం, పోలింగు సందర్భంగా సోమవారం కూడా సెలవురోజు అవటం.. ఈసారి ఇళ్లకు పయనమయ్యే వారి సంఖ్య బాగా పెరిగింది. మరోవైపు రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి (సొంతూరు) వెళ్లేవారి సంఖ్య కూడా ఎక్కువగా ఉండటంతో బస్టాండ్లు రద్దీగా మారాయి. దీంతో సొంత గమ్యానికి చేరాలంటే ఒక్కొక్కరు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

యువత ఉత్సాహం

గడిచిన పదేళ్లలో లక్షలాది మంది యువత రాష్ట్రం నుంచి ఉపాధి, ఉద్యోగాల కోసం తెలంగాణలోని హైదరాబాద్, కర్ణాటకలోని బెంగళూరుకు తరలివెళ్లారు. రాష్ట్రంలో ఎటువంటి ఉద్యోగ అవకాశాలు లేకపోవటంతో ప్రతి సంవత్సరం లక్షలాది మంది పట్టభద్రులు, ఇంజినీరింగు అభ్యర్థులు ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు రావటంతో వారంతా కసిగా ఈ ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకుని, భవిష్యత్‌కు బాటలు వేసే పార్టీని గెలిపించుకునేందుకు సిద్ధమయ్యారు. అలాగే తొలిసారి ఓటు హక్కు సాధించిన ఎక్కువ మంది యువత కూడా తమ హక్కును వినియోగించుకునేందుకు సొంతూళ్లకు వెళ్తున్నారు. దీంతో పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా ఊళ్లన్నీ ప్రజలతో సందడిగా మారాయి. సాధారణంగా సంక్రాంతి పండగకు హైదరాబాద్ లేదా బెంగళూరు నుంచి ఎక్కువ మంది రాష్ట్రానికి వస్తుంటారు. అయితే ఇప్పుడు అంతకంటే ఎక్కువ మంది ఓటు వేసేందుకు తరలొస్తుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇలా లక్షలాదిగా తరలొస్తున్న యువత ఎవరికి ఓటు వేస్తారు? వారు ఎటువైపు మొగ్గు చూపుతారు? వారి ప్రభావం ఎంత? అనే అంశంపైనా రాజకీయ పక్షాల్లో విపరీతమైన చర్చ నడుస్తోంది.

ప్రయాణికులతో కిక్కిరిసిన విజయవాడ బస్టాండ్

కిక్కిరిసిన విజయవాడ బస్‌స్టేషన్

విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకునేందుకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఇతర సుదూర ప్రాంతాల నుంచి రైళ్లలో వచ్చిన వారు తమ సొంత గ్రామాలకు వెళ్లేందుకు బస్సు సర్వీసులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికుల రద్దీని నియంత్రించడం అధికారులకు తలకు మించిన భారంగా మారింది. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలకు వెళ్లేందుకు వేలాది మంది ప్రయాణికులు బస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించారు. ఈ నెల 12న (ఆదివారం) హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రయాణికులను తరలించడానికి 121 స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్‌టిసి అధికారులు వెల్లడించారు. పెరిగిన ప్రయాణికుల రద్దీకి ఇవి ఏమాత్రమూ చాలకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్పెషల్ బస్సుల్లో అదనపు ఛార్జీలు వెచ్చించి, కూర్చొనేందుకు సీటు లేక నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు వాపోయారు.

ప్రత్యేక బస్సుల కోసం 9959111281 సంప్రదించండి: ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ సామగ్రిని గ్రామాలకు తరలించేందుకు 5,458 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని ఎపిఎస్ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఓటర్లకు అవసరమైతే రద్దీని బట్టి 40 మంది వున్నామని కోరితే ఆ ప్రాంతానికి నేరుగా ప్రత్యేక సర్వీసును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు ఆదివారం ద్వారకా తిరుమలరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే హైదరాబాద్‌కు 1,066, బెంగళూరుకు 284 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని తెలిపారు. విజయవాడ నుండి విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, నెల్లూరు, కాకినాడ, ఏలూరు, ఒంగోలు, గుంటూరు ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు ఎక్కువగా నడుపుతున్నామన్నారు. ఎపిఎస్ఆర్‌టిసి ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్‌ను ఏర్పాటు చేసిందని, ప్రత్యేక బస్ సర్వీసుల కోసం 9959111281 నెంబరును సంప్రదించాలని సూచించారు.

వైసిపిది తప్పుడు ప్రచారం

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తప్పుడు వీడియోలు, ఆడియోలు, పోస్టులతో వైసిపి ప్రచారం చేస్తోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటమి అంచుల్లో ఉన్నా వైసిపికి బుద్ధి రాలేదని ఆదివారం ఎక్స్ (ట్విట్టర్)లో విమర్శించారు. కొన్ని గంటల్లో పోలింగు మొదలవబోతుందని, ఇప్పుడైనా నిజాయతీగా ఉండాలనే జ్ఞానం జగన్‌కు లేదని విమర్శించారు. కుల, మతాలను రెచ్చగొట్టే వీడియోలను చేయించారని ఆరోపించారు. తాను మాట్లాడినట్లు ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇలాంటి ఫేక్ వీడియోలు కుప్పలు తెప్పలుగా జగన్ చేయిస్తారని, వీటిని నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కుట్రలతో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై పోలీసులు, ఎన్నికల అధికారులు తక్షణం కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల నేతలతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, పరిశీలకుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలన్నారు. పూర్తిస్థాయి అప్రమత్తతతో చివరి ఓటు పోల్ అయ్యేవరకు పనిచేయాలని చెప్పారు. పోలింగ్ శాతం పెరిగేలా పార్టీ తరపున ప్రయత్నం చేయాలని సూచించారు. ఓటర్లు స్వేచ్ఛగా సౌకర్యవంతంగా ఓటు వేసే పరిస్థితిని కల్పించాలన్నారు. బిడ్డల భవిష్యత్తు కోసం నిత్యం శ్రమించే అమ్మలకు పాదాభివందనం అంటూ చంద్రబాబు ట్విట్టర్‌లో మాతృ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

సజ్జల భార్గవ్‌పై చర్యలు తీసుకోవాలి : దేవినేని

తప్పుడు ప్రచారాలు చేస్తున్న వైసిపి నేత సజ్జల భార్గవ్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఓడిపోతున్నామనే భయంతో జగన్, అతని గ్యాంగ్ మొత్తం దుష్ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తామని చంద్రబాబు చెప్పినట్లు భార్గవ్ రెడ్డి మార్ఫింగ్ వీడియోలు చేశారని, అచ్చెన్నాయుడు పేరుతో తప్పుడు లేఖలు సృష్టించారని విమర్శించారు. ఈ దుష్ప్రచారాలను ఆపేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను కోరామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య కోరారు. తిరుపతిలో ఓటర్లతో ప్రమాణం చేయించిన వైసిపి నేత కేతన రామారావుపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లకు వర్ల రామయ్య లేఖలు రాశారు.

విధుల్లోకి 'ఎయిరిండియా' సిబ్బంది

ముంబయి : ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తమ విమాన సేవలను క్రమంగా పునరుద్ధరిస్తోంది. రద్దయిన విమానాల సంఖ్య ఆదివారం నాటికి 20కి తగ్గింది. అనారోగ్య సెలవులపై వెళ్లి.. తమ నిరసన వ్యక్తం చేసిన క్యాబిన్ సిబ్బంది మొత్తం విధుల్లో చేరినట్లు కంపెనీ అధికారి ఒకరు వెల్లడించారు. మంగళవారం నాటికి పూర్తిస్థాయిలో విమానాలు నడుస్తాయని తెలిపారు. కంపెనీలో నిర్వహణ లోపాలు, కొంతమంది సిబ్బందిపై వివక్షను నిరసిస్తూ క్యాబిన్ సిబ్బందిలో దాదాపు 300 మంది సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో గతవారంలో చాలా విమాన సర్వీసులు రద్దయ్యాయి. అప్రమత్తమైన సంస్థ దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. వారితో సంప్రదింపులు జరపడంతోపాటు విధుల్లో చేరకపోతే కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. సెలవుపై వెళ్లిన సిబ్బంది ఈ నెల 11 నాటికి పూర్తిగా విధుల్లో చేరారని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ వెల్లడించింది. కంపెనీ షెడ్యూలింగ్ సాఫ్ట్‌వేర్‌లో లోపాల కారణంగా ఇంకా కొంత మంది సెలవుపై ఉన్నట్లు చూపిస్తోందని తెలిపింది.

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఇ-వేలం – విక్రయ నోటీసు

1	[illegible]	[illegible]	[illegible]	Rs. 24,57,000/-	Rs. 2,45,700/-	30/05/2024 Before 5 PM	10,000/-	24/05/2024 (11AM – 4PM)	31/05/2024 (11 AM-2PM)	NIL

https://www.bankeauctions.com & www.grihumhousing.com
తేది: 13.05.2024